సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 5 । జూన్ । 2023



ఫ్లెక్సీల కోసం రోడ్లకు తూట్లు
టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర సందర్భంగా మైదుకూరులో టీడీపీ వర్గీయులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేందుకు ప్రధాన రహదారులను తవ్వేశారు. - 8లో



ప్రాణం తీసిన పూచీకత్తు
తన స్నేహితుడి అప్పు విషయంలో తాను పూచీ పడినందుకు అప్పు ఇచ్చిన వారి చేతిలో చావు దెబ్బలు తిని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. - 8లో



పేదింటి బిడ్డలు.. వాలీబాల్‌లో మెరికలు
ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు రాజంపేట మండలం కూచివారిపల్లెకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు. - 8లో

నాడు నిర్లక్ష్యం.. నేడు సంక్షేమం

- చంద్రబాబు హయాంలో చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ మూత
- పునః ప్రారంభించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్
- కార్మికుల కన్నీరు తుడిచిన ప్రస్తుత సీఎం వైఎస్ జగన్



చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ

వల్లూరు : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో చెన్నూరు మండలంలోని దౌలతాపురం చక్కెర ఫ్యాక్టరీకి 'చంద్ర' గ్రహణం పట్టింది. టీడీపీ హయాంలో ఈ ఫ్యాక్టరీపై అవలంబించిన నిర్లక్ష్య ధోరణులు ఫ్యాక్టరీకి, దాన్ని నమ్ముకున్న కార్మికులు, రైతులకు అశనిపాతంగా మారాయి. ఫ్యాక్టరీ మూత పడ్డప్పుడు ఫ్యాక్టరీ బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలు కేవలం రూ.1.35 కోట్లు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తే తిరిగి ప్రారంభించవచ్చని పలువురు నిపుణులు సూచించారు. ఈ మేరకు నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లాకు చెందిన అప్పటి టీడీపీ నాయకులతో సహా ఇతర నాయకులు, కార్మికులు చేసిన వినతిని నాటి సీఎం చంద్ర బాబు చెవికెక్కించుకోలేదు. దీంతో ఫ్యాక్టరీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆర్థిక సమస్యలతో అప్పట్లో సుమారు 50 మంది కార్మికులు ఆకలి చావులకు గురి కాగా, మరికొంతమంది మానసికంగా వేదన చెంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

నాడు ఫ్యాక్టరీని పునః ప్రారంభించిన తండ్రి.. నేడు కార్మికుల కన్నీరు తుడిచిన తనయుడు

2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతోనే ఫ్యాక్టరీ జవసత్వాలు పోసుకొంది. చక్కెర ఫ్యాక్టరీ అభివృద్ధికి ఆయన రూ. 23.12 కోట్ల నిధులను మంజూరు చేసి ఫ్యాక్టరీని పునః ప్రారంభించడం ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇందులో భాగంగా ఆయన పాలనలో చక్కెర ఫ్యాక్టరీ బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలను 2005 మార్చిలో ఒన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ. 3.66.కోట్లు మంజూరు చేసి బ్యాంకుల నుంచి విముక్తి కల్పించారు. రూ. 66 లక్షలను చెరకు సాగు కోసం మంజూరు చేయించారు. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఫ్యాక్టరీలో 10 ఏళ్లుగా తుప్పు పట్టిన యంత్రాల మరమ్మతులకు, కర్మాగార నిర్వహణకు రూ 3కోట్లు ఇచ్చారు.

- ఆగస్టు 2006లో ఫ్యాక్టరీలో ఆధునిక యంత్రాల కొనుగోలుకు, మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం రూ. 7కోట్లు మంజూరు చేయించారు.
- 2007 సెప్టెంబర్‌లో ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు సాగు, కార్మికుల వేతనాలు, నిర్వహణకు రూ. 4 కోట్లు, 2008 డిసెంబర్‌లో రూ. 2.80కోట్లు మరమ్మతులకు కేటాయించి ఫ్యాక్టరీని విజయవంతంగా నడిపించారు. దీంతో ఇటు కార్మికులను, అటు రైతులను ఆదుకోవడానికి పూర్తి స్థాయిలో కృషి చేశారు. యాజమాన్య లోపం, చక్కెర ధరలు నిలకడగా లేకపోవడం వంటి కారణాలతో ఫ్యాక్టరీలో 2009 నుంచి క్రషింగ్ ఆగిపోయింది. వైఎస్ఆర్ అకాల మరణంతో ఫ్యాక్టరీ, రైతులు, కార్మికుల పరిస్థితి తిరిగి అంధకారంలోకి వెళ్లింది.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కమలాపురం నియోజవర్గ ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి కార్మికుల కష్టాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన 2012 మార్చి నుండి 2022 మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాల అరియర్స్ విడుదలకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 485 మంది కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.13.58 కోట్ల నిధులను విడుదల చేసి వారి కన్నీటిని తుడిచేందుకు కృషి చేశారు. దశాబ్ద కాలంగా జీతాల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో అష్ట కష్టాలు పడుతున్న కార్మికులు దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ తండ్రీ కొడుకులను తమ గుండెల్లో దాచుకుంటామని కృతజ్ఞతాపూర్వకంగా పేర్కొంటున్నారు.

చంద్రన్న పాలనలో కేసీ రైతులకు సాగు నీటి కష్టాలే..

చెన్నూరు మండలంలో వ్యవసాయం ఎక్కువగా కేసీ కాలువ నీటిపై ఆధారపడి ఉంది. చంద్ర బాబు నాయుడు అధికారంలో ఉన్నంత కాలం ఏ ఒక్క ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో కేసీ కాలువకు సాగు నీరు విడుదల గగనంగా మారేది. ఒక వేళ వదిలినా సగం ఖరీఫ్ సీజన్ ముగిసిన తరువాత నీటిని వదిలేవారు. దీంతో రైతులు తప్పనిసరిగా ఆలస్యంగా పంటలను సాగు చేసి తీవ్రంగా నష్ట పోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో పంటల సాగుకు భయపడిన రైతులు ఒక దశలో క్రాప్ హాలిడేను ప్రకటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

తండ్రీ కొడుకుల పాలనలో పుష్కలంగా సాగు నీరు

కాగా తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలోని 5 సంవత్సరాలు, ఆయన తనయుడు వైఎస్ జగన్ పాలనలోని 4 సంవత్సరాలు రాష్ట్రమంతా పుష్కలంగా వర్షాలు కురిశాయి. దీంతోపాటు కేసీ కాలువకు ప్రతి సంవత్సరం సకాలంలో సమృద్ధిగా నీటిని వదలడానికి చర్యలు చేపట్టారు. దీంతో రైతులు రెండు సీజన్లలో పంటలను సాగు చేసుకోవడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. రైతులు సాగు నీటి కోసం ఎలాంటి దిగులు లేకుండా సకాలంలో పంటలు సాగు చేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ కుటుంబానికి జీవితాంతం రుణ పడి ఉంటాం



టీడీపీ పాలనలో చక్కెర ఫ్యాక్టరీపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. కేవలం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేస్తే ఫ్యాక్టరీని తెరిచి యథావిధిగా నడపవచ్చని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడును కోరినా ఆయన కనికరించలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక కోట్లాది రూపాయల నిధులను విడుదల చేసి ఫ్యాక్టరీని తెరవడం ద్వారా కార్మికులను ఆదుకున్నారు. ఆయన తనయుడు ప్రస్తుత సీఎం జగన్ మోహన్‌రెడ్డి కార్మికులకు 10 సంవత్సరాలుగా రావాల్సిన బకాయిలను మంజూరు చేసి ఆదుకున్నారు. జీవితాంతం వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాం.

– పసుపులేటి కృష్ణ, షుగర్ ఫ్యాక్టరీ కార్మిక యూనియన్ లీడర్

రూ.18 కోట్ల వ్యయంతో కొండపేట, రూ.3.12 కోట్లతో గుర్రంపాడు వంతెనల నిర్మాణం

ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం నిత్యం తపిస్తూ తనను నమ్ముకున్న ప్రజల అభివృద్ధికి బాటలు వేయడంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన చెన్నూరు మండలంలో చేసిన అభివృద్ధి పనులు మండల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయి. ఆయన హయాంలో స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు రూ. 18 కోట్ల వ్యయంతో కొండపేట వంతెన నిర్మాణాన్ని, అలాగే రూ. 3.12 కోట్ల నిధులతో కుగ్రామమైన గుర్రంపాడు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయించారు. చెన్నూరు మండలంలోని చిన్నమాచుపల్లెను నగర పాలక సంస్థలో చేర్చి శాటిలైట్ సిటీని నిర్మించారు.



కొండపేట వంతెన

న్యూస్‌రీల్

వైభవం.. సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సర్వే, భూ రికార్డుల అధికారిగా మురళీకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీకృష్ణ

కడపకోటిరెడ్డిసర్కిల్ : సర్వే, భూ రికార్డుల కార్యాలయ అధికారిగా మురళీకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఈ స్థానంలో పనిచేస్తున్న కనుక ప్రసాద్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాపట్లలో పనిచేస్తున్న మురళీకృష్ణను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన మురళీకృష్ణను డిస్ట్రిక్ట్ సర్వేయర్లు కె.ప్రభాకర్, దేవేంద్రయ్య, రఘురామయ్య, చెన్నూరు సర్వేయర్ సోమశేఖర్, అర్బన్, రూరల్ సర్వేయర్లు చంద్రశేఖర్, రామాంజనేయులుతోపాటు ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉర్దూ ఉపాధ్యాయుల శిక్షణను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ 2018 ఉర్దూ ఎస్‌జీటీ అలాగే 1998, 2008 ఎంటీఎస్ అన్ని యాజమాన్యాలలో పని చేస్తున్న ఉర్దూ ఉపాధ్యాయుల ఇండక్షన్ ట్రెనింగ్‌ను జయప్రదం చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్‌బాషా, రాష్ట్ర ఆర్థికార్యదర్శి అసదుల్లా ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఇందులో కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల వారికి రాయచోటి డైట్ కళాశాలలో, కోసాంధ్ర జిల్లాలకు గుంటూరు గవర్నమెంట్ డైట్ కళాశాల, కర్నూలు జిల్లా వారికి కర్నూల్ డైట్ కళాశాలలో జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న డీఎస్సీ, 2018 ఎంటీఎస్ ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రవాణాశాఖలో ఇన్‌చార్జి అధికారుల నియామకం



కడప వైఎస్ఆర్ సర్కిల్ : అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాలకు ఇన్‌చార్జిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వైఎస్ఆర్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌గా పని చేస్తున్న మీరా ప్రసాద్ నెల రోజులు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా చిత్తూరు డీటీసీ నిరంజన్ రెడ్డిని నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి ఆర్టీఓగా దినేష్ చంద్ర



ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా పని చేస్తున్న శాంతకుమారికి డీటీసీగా పదోన్నతి రావడంతో ఏలూరుకు బదిలీ అయ్యారు. దీంతో అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా మదనపల్లి ఎంవీఐగా పని చేస్తున్న దినేష్ చంద్రను నియమించారు.

అనువాద నవలలు ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ క్రిష్ణమూర్తి రచించిన అనువాద నవలలను ఆవిష్కరించారు. ఆయన రచించిన కొత్త బంగారు లోకం, కలువ విరిసింద నవలలను కన్నడ భాషలోకి అనువదించారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం



నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు

అనంతపురం ఎంపీ తలారి రంగయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ విద్యార్థులకు ప్రజ్ఞా పురస్కారాల ప్రదానం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ప్రతిభ గల బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. చదువుతోనే ఏదైనా సాధించగలమని విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుపోవాలన్నారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలన్నారు. హైదరాబాదు అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ అధికారి బి.యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైపుణ్యం ఉండాలన్నారు. అపజయాలకు కుంగిపోకుండా లక్ష్యాన్ని పట్టుదలతో చేరుకోవాలన్నారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ ప్రతి గ్రూపులో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వి.బ్రహ్మయ్య, సమాఖ్య ప్రధాన కార్యదర్శి జింకా మార్కండేయ, కోశాధికారి మడకా సంటియ్య, తదితరులు పాల్గొన్నారు.

యువగళం కాదు.. యువతకు గాలం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ బాబు

సిద్దవటం : నారా లోకేష్ చేపట్టింది యువగళం పాదయాత్ర కాదని.. యువతకు గాలం వేసే కార్యక్రమమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు విమర్శించారు. మండలంలోని మూలపల్లిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి సురేష్ బాబుతో పాటు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకుడు లోకేష్ చేపట్టిన పాదయాత్రలో ప్రజలు లేక వెలవెలబోతోందని, పాదయాత్ర టీడీపీ నాయకులకు భారంగా మారిందన్నారు. ఎప్పుడెప్పుడు తమ నియోజకవర్గంలో పాదయాత్ర పూర్తి అవుతుందని టీడీపీ శ్రేణులు నాయకులు తలలు పట్టుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో ఉండే హామీలను అమలు చేస్తానంటే సంక్షేమం.. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తే సంక్షోభమా? చంద్రబాబు మేనిఫెస్టో అమలుతో ఏపీ మరో శ్రీలంకలా మారదా ? అని ఆయన ప్రశ్నించారు. 2014లో ఎన్నికల సందర్భంగా చంద్రబాబు 600 హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. 2019 సంవత్సరంలో ప్రజలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలకు పట్టం కట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి ఉపాసి వెంకట రమణారెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్ రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

కడప ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి జరుగుతున్న పాలిసెట్–2023 ధ్రువపత్రాల పరిశీలన 5వ తేదీ సోమవారంతో ముగియనుంది. ధ్రువ పత్రాల పరిశీలనలో భాగంగా ఆదివారం 7వ రోజు కడప పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ సెంటకు 175 (92001 నుంచి 1,08,000 ర్యాంకు వరకు) మంది విద్యార్థులు హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారు. చివరిరోజు సోమవారం 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. వివిధ కారణాలతో ఇప్పటి వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారు సోమవారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ జ్యోతి తెలిపారు. అలాగే ఎస్టీ విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు కడప మహిళా పాలిటెక్నిక్‌కు మాత్రమే రావాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన తరువాత 1వ తేదీ నుంచి మొదలు కావాల్సిన వెబ్ ఆప్షన్ వాయిదా పడిందని, ఎప్పుడు జరిగేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

కడప మహిళా పాలిటెక్నిక్‌లో పత్రాలను పరిశీలన చేయించుకుంటున్న విద్యార్థులు



కొత్త బంగారు లోకం

- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడి తప్పితే భవిష్యత్తు అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- ప్రారంభమైన జూనియర్ కాలేజీలు

27,097
జిల్లాలో పది పరీక్షలు రాసిన విద్యార్థులు

21,524
పాసైన విద్యార్థులు



కడప ఎడ్యుకేషన్: ఇప్పటి వరకూ హైస్కూలు చదువు... ఇక నుంచి కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంలో కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు..అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కాలేజీల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజ్‌లో అత్యంత కీలక సమయమిది. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్‌దశలోనే. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశలో కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభమయ్యాయి.

చదువుకే తొలి ప్రాధాన్యం

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరిపాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరుకావాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిపి గ్రూపు స్టడీ చేయడం అత్యంత కీలకం.

స్నేహం ప్రభావితం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీద అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరెట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలతపై వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకలు పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

చక్కటి భవిష్యత్తుకు రూపకల్పన మొదలయ్యేది ఇప్పుడే



మీ కెరీర్‌కు సంబంధించిన ఆలోచనలు మొదలయ్యేది ఇప్పటి నుంచే. అందుకు తగ్గట్టుగా మీలో కొన్ని మార్పులు మొదలవుతాయి. ఒక పక్క మీ వయసు, మరో పక్క కోరుకుంటున్న కొత్త పరిచయాలు ఉక్కిరిబిక్కిరి చేస్తూ మిమ్మల్ని కిందకు పడేసే అవకాశం ఉంది. ఈ కళాశాల విద్యలో ఆకర్షణలకు మొగ్గుచూపితే భవిష్యత్తు బుగ్గిపాలవుతుంది. అలా కాకుండా మీ కెరీర్‌కు సంబంధించిన లక్ష్యానికి ఇక్కడే మీరు రూపకల్పన చేసుకోగలిగితే మరింత ఉత్సాహంగా, హుషారుగా ముందుకు వెళతారు.

– ఓ. వెంకటేశ్వరరెడ్డి, సైకాలజిస్టు, కడప.

ఇంటర్ విద్య వారధి లాంటిది



విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ విద్య ఒక వారధి లాంటిది. ఇక్కడ సక్రమంగా నడుచుకుని బాగా చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అధ్యాపకులు చెప్పే బోధనలు శ్రద్ధగా వింటూ బాగా చదువుకుంటే మంచి ఉద్యోగాలను సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చినవారవుతారు. – షేక్ నూర్జహాన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, కడప.

క్లుప్తంగా

జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్



కడప ఏఎస్‌ఆర్ నగర్‌లో తనిఖీలు చేస్తున్న కడప తాలూకా సీఐ ఉలసయ్య, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్‌ఆపరేషన్‌ను పోలీసులు నిర్వహించారు. కడపలోని ఏఎస్‌ఆర్ నగర్ ప్రాంతంలో సీఐ ఉలసయ్య తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ సయ్యద్ హాసం ఆధ్వర్యంలో, యానాదికాలనీలో ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో కలిసి తనిఖీలను నిర్వహించారు.

పాతసామాన్ల షాపులో అగ్నిప్రమాదం



పాతసామాన్ల షాపులో వ్యాపిస్తున్న మంటలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండలం లోని తాళ్లమాపురం పంచాయతీ పరిధిలో ఉన్న మూలవారిపల్లెలో ఎస్‌హెచ్ గౌస్‌బాషాకు చెందిన పాతసామాన్ల షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో షాపులో నుంచి మంటలు రావడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు ఎక్కువగా వ్యాపించడంతో ప్రొద్దుటూరుతో పాటు మైదుకూరు అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సహాయ అధికారి రఘునాథ్ తెలిపారు.

పిచ్చికుక్క వీరంగం

మదనపల్లె : పిచ్చికుక్క వీరంగం చేసి 30 మందికి పైగా కరవడంతో తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం మండలంలోని మాలేపాడు గ్రామంలో జరిగింది. మాలేపాడులో శనివారం రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి తిరుణాలకు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. జాతర నుంచి ఇంటికి తిరిగి వస్తున్న వారిపై ఓ పిచ్చికుక్క దాడిచేసి కరిచింది.

పేదింటి బిడ్డలు.. వాలీబాల్‌లో మెరికలు

ఒకే కుటుంబంలో ముగ్గురు జాతీయ స్థాయి క్రీడాకారులు



వాలీబాల్‌లో ప్రతిభ చాటి కైవసం చేసుకున్న కప్పులు, మెడల్స్



క్రీడాకారుల పేదరికానికి నిదర్శనం ఈ ఇల్లు

రాజంపేట టౌన్ : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నారు అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం కూచివారిపల్లెకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు. తండ్రి సంచార వ్యాపారానికి, తల్లి కూలీ పనులకు వెళితేనే వారి కుటుంబం గడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రామ్మోహన్, మణెమ్మల ముగ్గురు పిల్లలు వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరుస్తూ..జాతీయ స్థాయిలో రాణిస్తూ.. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సాధారణంగా ఎవరి కుటుంబంలో అయినా పిల్లలు ఒక్కొక్కరు ఒక్కో రంగంలో ప్రతిభ కనబరుస్తారు. అయితే వీరి కుటుంబంలో ముగ్గురు పిల్లలు కూడా వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకొని రాణిస్తుండటం విశేషం. తేజ, సరిత, సాయిప్రతాప్‌లు పాఠశాల స్థాయిలోనే వాలీబాల్‌లో ప్రతిభచాటడాన్ని గమనించిన రిటైర్డ్ పీడీ, వాలీబాల్ కోచ్ వారిపై ప్రత్యేక దృష్టిసారించి ప్రోత్సహిస్తూ వచ్చారు. ఫలితంగా డిగ్రీ పూర్తి చేసుకొని పోలీస్ సెలక్షన్స్ ప్రయత్నాల్లో ఉన్న తేజ ఏడుమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడింది. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సరిత ఇప్పటి వరకు తొమ్మిదిమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడి రెండుమార్లు బెస్ట్‌ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయిప్రతాప్ ఇటీవలే జాతీయ స్థాయి వాలీబాల్‌లో పోటీల్లో ఆడారు.

తలదాచుకునేందుకు సరైన గూడు కూడా లేని దుస్థితి

జాతీయ స్థాయిలో రాణిస్తున్న వాలీబాల్ క్రీడాకారులది ఒక విధంగా కఠిక పేదరికమనే చెప్పాలి. సరైన గూడు కూడా లేక పోవడంతో ఐదుగురు ఉన్న ఈ కుటుంబం తలదాచుకునేందుకు ఇబ్బందులు పడుతోంది. తల్లిదండ్రులు ఎంత కష్టపడ్డా తమ పిల్లల పోషణ, ఇతర అవసరాలకు కూడా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అందువల్ల దాతలు ఎవరైనా తమ పిల్లలకు చేయూతనివ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అమ్మానాన్నల కష్టమే విజయ రహస్యం



మేము ఎస్టీ వర్గానికి చెందిన వాళ్లం. సాధారణంగా మా ఇళ్లల్లో ఆడపిల్లలకు 18 ఏళ్ల లోపే వివాహం చేస్తారు. కానీ మా అమ్మానాన్నలు మాకు వివాహం చేసి చేతులు దులుపుకోవాలనుకోలేదు. బాగా చదివించాలని శక్తికి మించి కష్టపడుతున్నారు. నాన్నకు టీబీ వచ్చినా మా కోసం కష్టపడుతున్నాడు. నేను బీఈడీ పూర్తిచేసి పోలీస్ సెలక్షన్ ప్రయత్నాల్లో ఉన్నా. చదువులోనూ, వాలీబాల్‌లోను విజయం సాధిస్తున్నాను అంటే అది అమ్మానాన్నల కష్టమే.

- తేజ, వాలీబాల్ క్రీడాకారిణి, రాజంపేట

అంతర్జాతీయ స్థాయిలో స్థానమే లక్ష్యం



అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే ఏకైక లక్ష్యం. అందుకోసం కఠోర సాధన చేస్తున్నా. వాలీబాల్ క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి. తద్వారా పేదరికం నుంచి బయటపడి అమ్మా, నాన్నలకు కష్టం కలగకుండా చూసుకోవాలనేదే నాకోరిక.

- సరిత, వాలీబాల్ క్రీడాకారిణి, రాజంపేట

అక్కావాళ్ల స్ఫూర్తితోనే



మా ఇద్దరు అక్కయ్యలు వాలీబాల్ పోటీల్లో రాణించేందుకు చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడుతున్నారు. అనేకమార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఆడటం వల్ల వారిని అందరూ గౌరవిస్తున్నారు. నేను కూడా మా అక్కయ్య వాళ్లలాగా అందరితో శభాష్ అనిపించుకోవాలి. వాళ్లను స్ఫూర్తిగా తీసుకుని సాధన చేస్తున్నా. తొలిప్రయత్నంలోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఈ క్రెడిట్ అంతా మా కోచ్ షామీర్ సార్‌దే.

- సాయిప్రతాప్, వాలీబాల్ క్రీడాకారుడు, రాజంపేట

ఫ్లెక్సీల కోసం రోడ్లకు తూట్లు

మైదుకూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర సందర్భంగా మైదుకూరులో టీడీపీ వర్గీయులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేందుకు ప్రధాన రహదారులను తవ్వేశారు. ప్రొద్దుటూరు నుంచి లోకేష్ మైదుకూరు నియోజకవర్గంలో అడుగు పెట్టి శనివారం సాయంత్రం మైదుకూరు పట్టణంలో పాదయాత్ర, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ నాయకుడికి స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక రాయల కూడలి నుంచి నాలుగు ప్రధాన రోడ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందుకోసం కొయ్యలను పాతేందుకు రోడ్లపై డ్రిల్లింగ్ చేసి రంధ్రాలు వేశారు. దీని వల్ల రహదారులు దెబ్బతినే అవకాశం ఉన్నా టీడీపీ కార్యకర్తలు ఖాతరు చేయలేదు. దీనిపై సంబంధిత హైవే అధికారులు గానీ, ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం పట్ల ప్రజల్లో విస్మయం వ్యక్తం అవుతుంది. ఫ్లెక్సీల కోసం రోడ్లను తూట్లు పొడవడంపై అధికారులు స్పందించాల్సి ఉంది.



మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో సిమెంటు రోడ్డుపై వేసిన రంధ్రాలు

'సీమ' కథా సాహిత్యానికి కేరాఫ్ 'కేతు'



మాట్లాడుతున్న ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి

కడప కల్చరల్ : సీమ సమస్యలను కథలుగా ప్రపంచానికి పరిచయం చేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సీమ కథా సాహిత్యానికి కేరాఫ్‌గా నిలిచారని పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అన్నారు. ప్రముఖ కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణసభను ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆచార్య కేతు చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అరసంతో కేతుకు గల అనుబంధం, సాహితీ లోకంలోగల ప్రాధాన్యత, యువ రచయితలకు ఇచ్చే ప్రోత్సాహం, వ్యక్తిత్వం గురించి వివరించారు. దగాపడిన సీమ స్థితి గురించి ఆయన రాసిన కథలు సీమ అస్తిత్వ సాధన అవసరాన్ని తెలుపుతున్నాయన్నారు. తమ విశ్వవిద్యాలయంలో కేతు సమగ్ర సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ కేతు మరణం అరసంకు పెద్దలోటని అన్నారు. సీమ సాహిత్య చైతన్యానికి ఆయన సాధించిన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డే నిదర్శనమన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు మాట్లాడుతూ కేతు తమ ప్రాంతం కడగండ్లను గాడానురక్తితో హృదయాన్ని హత్తుకునేలా కథలుగా రాశారన్నారు. ఆచార్య కేతుకు సన్నిహితులైన కథకులు పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఆయన రచనల్లో నమ్ముకున్న నేల గొప్పదని, సీమ ప్రాతినిధ్య కథకునిగా ఆయనకు పేరు తెచ్చి పెట్టిందన్నారు. నేటితరం కథకులకు ఆయన దీపధారి అని అభివర్ణించారు. లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి తన మాటల్లో ఆచార్య కేతు రచనల రూపంలో మనకు తరగని ఆస్తిని ఇచ్చి వెళ్లారని, ఆ రచనలు ఉన్నంత వరకు ఆయన జ్ఞాపకాలు సజీవమన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి పేరిట అవార్డు

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట నగదుతో కూడిన సాహిత్య పురస్కారాన్ని తమ కవిత విద్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఓ సాహితీవేత్తకు అందజేస్తామని సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి సభలో ప్రకటించారు. రాష్ట్ర అధికార భాషా సంఘ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, సీపీఐ నేత గాలి చంద్ర, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జానమద్ది విజయభాస్కర్, బాసట బాలాజీరావు, కొండూరు జనార్దన్‌రాజు, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి కేతుతో తమకుగల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలుత వైవీయూ వీసీ చింతా సుధాకర్ పంపిన సంతాప సందేశాన్ని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి చదివి వినిపించారు. అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు సభను పర్యవేక్షించారు.

ఏపీఎండీసీపై టీడీపీ ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాజకీయ లబ్ధికోసం టీడీపీ నాయకులు ఏపీఎండీసీపై అసత్య ఆరోపణలు చేయడం తగదని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో బెరైటీస్ ద్వారా రూ. 1100 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు వేల టన్నుల బెరైటీస్ ఖనిజం అక్రమాలు జరిగితే ఇంత ఆదాయం ఎలా వస్తుందని ప్రశ్నించారు. కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉన్న చోట వేల టన్నుల బెరైటీస్ అక్రమంగా తరలించడం ఎలా సాధ్యమవుతుందన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద నివేదికలు ఉన్నా కూడా టీడీపీ నాయకులు కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని పచ్చ పత్రికల్లో రాయించడం అర్థరహితమని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏపీఎండీసీ బెరైటీస్ ప్రఖ్యాతి గాంచిందని, దీని ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బెరైటీస్ రవాణా విషయంలో ప్రొడక్షన్ నుంచి స్టాక్ యార్డ్ రవాణా వరకు ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామని, ప్రతి చిన్న విషయాన్ని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల కొందరు సిబ్బంది సాంకేతికతను వినియోగించుకొని అక్రమ రవాణకు పాల్పడ్డారని, అప్రమత్తమై ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రత్యేక కమిటీ నియమించామన్నారు. బాధ్యులైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రెండు వాహనాల్లో అక్రమంగా రవాణా చేసిన 35 టన్నుల 100 గ్రాముల బెరైటీస్ ఖనిజాన్ని రికవరీ చేసినట్లు చెప్పారు. ఇందుకు సహకరించినట్లు భావిస్తున్న మూడు ఫల్వ రైజింగ్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. కొందరు ఉద్యోగులు చేసిన తప్పులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇందులో దోషులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రాజెక్టును ఆటోమేషన్ పరిధిలోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. మంగంపేటలో జరిగిన వాస్తవాలు తెలియకుండా కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు. అక్రమ రవాణపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, దీనిపై సందేహాలు ఉంటే ఏపీఎండీసీ మంగంపేట సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని, పూర్తి వివరాలు తెలియజేస్తారని చెప్పారు. భారీ ఎత్తున అక్రమలు జరిగాయని, ప్రజలను అపోహలకు గురి చేసేవిధంగా ప్రవర్తిస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ లాడ్జిలో రూంలో అద్దెకు దిగిన పూల సాయితేజ (29) అనే యువకుడు తనకు ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మైదుకూరులో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకటరామయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఓ కుమారుడైన సాయితేజ మూడు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. మానసిక ఆవేదనతో ఈనెల 3వ తేదీన ఇంటిలో చెప్పకుండా కడపకు వచ్చాడు. ఓ లాడ్జిలో రూం తీసుకుని తన వెంట తెచ్చుకున్న పురుగులమందును తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళుతున్న సమయంలో కడపలోని తమ మేనత్తకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె వెంటనే తన అన్న వెంకటరామయ్యకు ఫోన్‌చేసి, అంబులెన్స్‌లో సాయితేజను కడపలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే తిరుపతి స్విమ్స్‌కు తీసుకుని వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయితేజ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్‌ఐ రవికుమార్ తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాతబస్టాండులోని పీఎస్‌ఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాంప్లెక్స్‌లోని వ్యాపారులు దుకాణం తెరిచేందుకు ఆదివారం ఉదయం రాగా అతను చనిపోయి ఉన్నాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. అతనికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. ఈ వ్యక్తికి సంబంధించిన వారు ఔట్‌పోస్టులో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ షబ్బీర్‌బాషా తెలిపారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

మదనపల్లె : పాము కాటేయడంతో రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మదనపల్లె మండలం పోతపోలులో జరిగింది. గ్రామానికి చెందిన వీరభద్ర(39) పొలం పనులు చేసుకుంటుండగా విషసర్పం కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

కారు,ఆటో ఢీ: ఆరుగురికి తీవ్రగాయాలు





వాహనాలను రోడ్డుపై నుంచి తొలగిస్తున్న స్థానికులు, చికిత్స పొందుతున్న ఆంజనేయరాజు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ శివారులో ఉన్న గంగా భవాని ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం కారు-ఆటో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా...రాజంపేట నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారు పెట్రోల్ బంకు నుంచి రోడ్డు పైకి వస్తున్న ఆటోను అతివేగంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న మాచుపల్లి పంచాయతీ తురక పల్లి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్, నారాయణ, వెంకటయ్య, గురవయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.ట్రాఫిక్ అంతరాయం కలగకుండా రహారికి అడ్డంగా ఉన్న వాహనాలను స్థానికుల సాయంతో తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు ఢీ కొని వృద్ధుడికి..

రాజంపేట : ఆర్టీసీ బస్టాండులో ఎల్. ఆంజనేయరాజు (రిటైర్డ్ జుడిషియల్ ఉద్యోగి)ని ఆదివారం ఉదయం కడప-తిరుపతి బస్సు ఢీ కొంది. తమ సంబంధీకులను రాయచోటి బస్సు ఎక్కించేందుకు ఆయన ద్విచక్రవాహనంలో వచ్చారు. అదే సమయంలో తిరుపతికి వెళుతున్న బస్సును ప్రమాదవశాత్తు ఢీ కొంది.గాయపడిన ఈయనను చికిత్స నిమిత్తం తిరుపతి కీర్తి ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందచేస్తున్నారు.అర్బన్ పోలీసులు కేసునమోదు చేశారు.

ప్రాణం తీసిన పూచీకత్తు

- హత్యకేసు ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్
- నిందితుల్లో ఇంజినీరింగ్ విద్యార్థులు



నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్ : తన స్నేహితుడి అప్పు విషయంలో తాను పూచీ పడినందుకు నిందితుల చేతిలో చావుదెబ్బలు తిని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. హత్య కేసుగా నమోదైన 24 గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ సంఘటనపై ఆదివారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ ఎం.డి షరీఫ్ విలేకరులకు వివరాలను తెలియజేశారు.

కడప నగరం ఊటుకూరుకు చెందిన పాలెంపల్లి శ్రీకాంత్ రెడ్డి అక్కాయపల్లిలో నివాసం ఉంటున్నాడు. అతని స్నేహితుడు సత్యనారాయణ అలియాస్ సత్య ఈ కేసులో ప్రధాన నిందితులైన కడప నగరం శంకరాపురానికి చెందిన అండ్లూరు చైతన్యకుమార్ రెడ్డి, చిన్నచౌక్ ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల ఒక్కొక్కరి వద్ద రూ. 10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తమ అప్పు తీర్చాలని పెద్దమనుషుల సమక్షంలో అడిగారు. ఆ సమయంలో సత్యనారాయణ స్నేహితుడైన శ్రీకాంత్‌రెడ్డి పూచీపడ్డాడు. తర్వాత పలుకకపోవడంతో మే 31న నిందితులు, మూడో నిందితురాలైన కడప నాగరాజుపేటకు చెందిన, టిఫిన్ సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ అక్క మద్దాల చాముండేశ్వరి ఇంటివద్దకు శ్రీకాంత్‌రెడ్డిని పిలిపించారు. అక్కడ నిర్బంధించి మిగిలిన నిందితుల సహకారంతో కొట్టారు. డబ్బులను కడితేనే వదిలి పెడతామన్నారు. అతన్ని ముత్తరాసపల్లిలోని లీల అలియాస్ శ్రీలీల ఇంటికి తీసుకెళ్లారు కట్టెలతో, క్రికెట్‌బ్యాట్‌తో కొట్టారు, కాళ్లతో తన్నారు. పాలెంపల్లి శ్రీకాంత్‌రెడ్డి స్పృహకోల్పోయి అక్కడికక్కడే చనిపోయాడు. తరువాత ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని కాల్చి మాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వెంటనే డ్రైవర్ లేకుండా సెల్ఫ్‌డ్రైవింగ్ చేసుకుంటామని ఇతియోస్ కారును బాడుగకు తీసుకున్నారు. రెండు క్యాన్‌లలో 1200 రూపాయలకు పెట్రోల్ తీసుకున్నారు. శవాన్ని కారులో తీసుకెళ్లి చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలో మూలవంకలో కంపచెట్లలో వేశారు. పెట్రోల్ పోసి తగులబెట్టేశారు. మరుసటి రోజున పశువుల కాపరుల సమాచారంతో మొదట గుర్తు తెలియని మృతదేహంగా భావించి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌రెడ్డి రెండురోజులుగా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతకొమ్మదిన్నె పరిధిలో లభ్యమైన మృతదేహాన్ని శ్రీకాంత్‌రెడ్డిదిగా గుర్తించారు. దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి హత్య కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను కనుగొన్నారు. ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం ఏడుగురు నిందితులను ఊటుకూరు సర్కిల్- రిమ్స్ ఔటర్ రింగ్‌రోడ్డులోని పెద్దముసల్‌రెడ్డిపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కట్టెలు, క్రికెట్‌బ్యాట్, శవాన్ని కాల్చేందుకు తెచ్చిన పెట్రోలు క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసులో అరెస్టయిన వారిలో ఫైనాన్స్ వ్యాపారి అండ్లూరు చైతన్యకుమార్‌రెడ్డి, ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల, నాగరాజుపేటకు చెందిన మద్దాల చాముండేశ్వరి, చింతకొమ్మదిన్నె మండలం, నరసరామయ్యగారిపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సోమశివ ప్రశాంత్ యాదవ్ అలియాస్ ప్రశాంత్, పాతకడప మామిడివీధికి చెందిన జకట ఉదయ్‌కిరణ్, శంకరాపురానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సింగనమల వెంకటసాయి, శ్రీలీల భర్త కాకి మోహన చంద్ర ఉన్నారు. వీరిని 24 గంటల్లోనే అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప రూరల్ సీఐ కె. అశోక్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి, ఎస్‌బి ఎస్‌ఐ నర్రెడ్డి రాజరాజేశ్వర రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు విద్యాసాగర్, విశ్వనాథరెడ్డి, లక్షుమయ్య, కానిస్టేబుళ్లు జనార్దన్ రెడ్డి, విజయ్, అశోక్, సాయికుమార్, సి. సుధాకర్‌యాదవ్, హోంగార్డు లక్ష్మీరెడ్డి, అనిత, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ అభినందించారు.